క్లుప్తంగా

మాజీ మంత్రి వేణుకు పొన్నాడ పరామర్శ



సుభద్రమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు

కాట్రేనికోన: మాతృ వియోగంతో బాధపడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను వైఎస్సార్ సీపీ డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి పితాని బాలకృష్ణ పరామర్శించారు. బుధవారం రామచంద్రపురంలో మాజీ మంత్రి స్వగృహంలో ఆయన మాతృమూర్తి సుభద్రమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ నేల కిషోర్, వల్లభని దొరబాబు తదితరులు ఉన్నారు.

రాత్రి 11 వరకూ వ్యాపారాలకు సహకరించాలి

సీఐకు చాంబర్ ఆఫ్ కామర్స్ వినతి



సీఐ క్రిష్టోఫర్‌కు వినతిపత్రం ఇస్తున్న చాంబర్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పట్టణంలో గతంలో రాత్రి 11 గంటల వరకూ చిరు వ్యాపారాలు నిర్వహించే వెసులుబాటు ఉండేదని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ పట్టణ సీఐ కె.క్రిష్టోఫర్‌కు వివరించారు. ఇప్పుడు రాత్రి 10 గంటలకే పోలీసు ఆంక్షలతో దుకాణాలు మూసివేయాల్సి వస్తోందని ది అమలాపురం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం విన్నవించింది. ఈ మేరకు సీఐ కె.క్రిష్టోఫర్‌కు బుధవారం రాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌లో ప్రతినిధుల బృందం వినతి పత్రం అందించింది. చాంబర్ ముఖ్య సలహాదారు నల్లా పవన్‌కుమార్, కార్యదర్శి కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, ప్రతినిధులు చింతలపూడి సత్తిబాబు, వగ్రే బాబి, గోకరకొండ గంగన్నస్వామి, వీరా తాతాజీ, పుల్లేశ్వరరావు తదితరులు ఉన్నారు.


కుళాయిల్లో కలుషిత నీటి సరఫరా



గొల్లలవీధిలో కుళాయి నుంచి వస్తున్న కలుషిత నీరు

కాట్రేనికోన: నడవపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి ప్రాజెక్టు చెరువు నుంచి బుధవారం ఫిల్టరు కాని, కలుషిత నీరు సరఫరా అయింది. కాట్రేనికోన పంచాయతీ పరిధిలో గొల్లలవీధి, కాట్రేనికోన, వేట్లపాలెం, రాజానగరం, గచ్చకాయలపోర, చిర్రయానం గ్రామాలకు నడవపల్లి మంచినీటి ప్రాజెక్టు చెరువు నుంచే సరఫరా చేస్తారు. గొల్లలవీధిలో మంచి నీటి కుళాయిల ద్వారా ఫిల్టరు కాని, కలుషిత నీరు సరఫరా చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజులకోసారి నాలుగు బిందెలు నీళ్లు మాత్రమే ఇస్తున్నారని, కలుషిత నీటిని ఎలా తాగాలని వారు ప్రశ్నించారు. దీనిపై సంబంధిత అధికారులను నిలదీశారు.

కలెక్టర్‌కు చేనేత నాయకుల సత్కారం



కలెక్టర్ మహేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

అమలాపురం రూరల్: కోనసీమ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రావిరాల మహేష్‌కుమార్‌ను బండారులంకకు చెందిన చేనేత సంఘ నాయకులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, పుత్సల వరదరాజు కలిసి శ్రీశైలం మల్లికార్జున స్వామివారి కుచ్చు ఇచ్చి, చేనేత వస్త్రాలతో కలెక్టర్‌ను సత్కరించారు. త్వరలో బండారులంక చేనేత గ్రామాన్ని సందర్శిస్తానని కలెక్టర్ చెప్పారు.

హెచ్‌ఎంకు ఘన సత్కారం


ఐ.పోలవరం: ఐ.పోలవరం జెడ్పీ హైస్కూల్ రాజపత్ర హెచ్‌ఎం వైఎస్ రామాంజనేయులు పదవీ విరమణ సందర్భంగా బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక విద్యా కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథి డీవైఈఓ జి.సూర్యప్రకాశరావుతో పాటు, ఎంఈఓలు కొండారెడ్డి, తిరుమలరావు, సర్పంచ్ పైడిరాజు, ఉప సర్పంచ్ శ్రీచక్రం తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో జర భద్రం

- అపరిశుభ్రతే సీజనల్ వ్యాధులకు మూలం
- ప్రాణాంతక జ్వరాలకు దోమలే కారణం
- మందులు అందుబాటులో ఉన్నాయంటున్న వైద్యాధికారులు



ముమ్మిడివరం నగర పంచాయతీలో అధ్వానంగా ఉన్న కంపోస్టు యార్డు



ముమ్మిడివరం: కొద్ది రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణ మార్పులతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వైరల్ జ్వరాలు, ఇతర రోగాలు విజృంభిస్తున్న తరుణంలో, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాంతక పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదు.

ముమ్మిడివరం నియోజకవర్గంలో 67 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. సుమారు 2.87 లక్షల మంది జనాభా ఉన్నారు. ముమ్మిడివరం ప్రభుత్వాస్పత్రి, ఎనిమిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఆయా వైద్యాలయాల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. సీజనల్ వ్యాధులకు సంబంధించి అన్ని రకాల మందులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయని వైద్యాధికారులు చెబుతున్నారు. పంచాయతీల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా క్లోరినేషన్ అంతంతమాత్రంగానే జరుగుతోంది.

నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రదేశాల్లో నీరు చేరుతోంది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉంది, రోగాలు వచ్చాక బాధపడడం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్యులు అంటున్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే చాలా వరకూ వ్యాధులను నియంత్రించవచ్చని చెబుతున్నారు. ప్రజల ఆరోగ్యం క్షీణించడానికి దోమలే ప్రధాన కారణం. వీటివల్ల డెంగీ, మలేరియా, బోద, మెదడు వాపు, చికున్‌గున్యా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఎక్కువ. ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా, నీటి నిల్వలు ఉంటే దోమలు పెరిగి, వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది. కొన్ని వ్యాధుల లక్షణాలు ఇలా ఉన్నాయి.

> **సేవలు వినియోగించుకోండి**
>
> 
>
> జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన మందులు పీహెచ్‌సీల్లో సిద్ధం చేశాం. అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నాం. వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా వర్కర్లు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలి.
>
> – డా.సీహెచ్ ముకుందా, పీహెచ్‌సీ వైద్యాధికారి, కొత్తలంక

డెంగీ జ్వరం

అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, నొప్పులతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం తగ్గినట్టు తగ్గి, వారం, పది రోజులు ఉంటుంది. ఏడీఎస్ దోమ వల్ల వచ్చే ఈ జ్వరం ఒకరి నుంచి మరొకరికి వస్తుంది. కళ్ల నొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం ఈ జ్వరం లక్షణాలు. అలాగే ముక్కు మలం ద్వారా రక్తం వచ్చే అవకాశం ఉంటుంది.

మలేరియా

తీవ్రమైన జ్వరం, చలితో వణుకు ప్రారంభమై, నెలల తరబడి బాధిస్తోంది. ఆడ ఎనాఫిలిస్ దోమ వల్ల వ్యాపించే ఈ వ్యాధి వర్షాకాలంలో అధికంగా వస్తుంది. నీరు నిల్వ ఉంటే దోమలు ఉత్పత్తి అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

కనీస జాగ్రత్తలు

- వర్షా కాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి.
- ఎప్పటికప్పుడు నీటి పాత్రలను శుభ్రపరిచి, క్లోరినేషన్ చేసిన నీటినే తాగాలి,
- భోజనానికి ముందు చేతులు శుభ్రం చేసుకోవాలి.
- ఇంటిని, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- మురుగు నీటి ప్రాంతాల్లో కిరోసిన్, వేస్టాయిల్ చల్లి దోమల లార్వాను నాశనం చేయాలి.
- ఇంటి కిటికీలకు మెష్‌లు ఏర్పాటు చేయాలి.

తొలి విడత అడ్మిషన్ల జాబితా విడుదల

యానాం: యూజీ నాన్‌నీట్ 2024–25 వృత్తి కోర్సులకు తొలి రౌండ్ డ్రాఫ్ట్ అలాట్‌మెంట్ జాబితాను బుధవారం సెంటాక్ కన్వీనర్ అమన్‌శర్మ విడుదల చేశారు. వీటిలో ఎన్నారై, ఎన్నారై స్పాన్సర్డ్, ఓసీఐ, సీఐడబ్ల్యూజీసీకి చెందిన అభ్యర్థులు ఉన్నారన్నారు. అలాట్‌మెంట్ జాబితాను అభ్యర్థులు సెంటాక్ పుదుచ్చేరి.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకుని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటల్లోగా తెలియజేయాలని కోరారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తొలి ప్రొవిజనల్ అలాట్‌మెంట్ జాబితాను ఈ నెల 12 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కాలేజీల్లో ఈ నెల 12 నుంచి ఆయా ప్రిన్సిపాళ్లకు రిపోర్టు చేయాలని, అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజును తీసుకువెళ్లాలన్నారు. జాయినింగ్‌కు ఈ నెల 17 ఆఖరు తేదని, వివరాలకు హెల్ప్ డెస్క్ 0413–2655570, 2655571 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. బీటెక్ లేటరల్ ఎంట్రీ మెరిట్ జాబితాను సైతం సెంటాక్ ప్రకటించింది. అభ్యర్థులు సెంటాక్ వెబ్‌సైట్‌లో తమ పేర్లను పరిశీలించి, అభ్యంతరాలను ఈ నెల 12లోగా తెలపాలని కోరింది.

విద్యా సామగ్రి అందజేత

తాళ్లరేవు: చినగోవలంక ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సుంకరపాలెం మాజీ సర్పంచ్ మోపూరి శ్రీనివాస కిరణ్ విద్యా సామగ్రి అందజేశారు. బుధవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస కిరణ్ ఆర్థిక సహకారంతో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు తదితర వాటిని పంపిణీ చేశారు.

మొగను తవ్వితే పంటకు ముప్పే

తహసీల్దార్ వద్ద రైతుల గోడు



ఉప్పలగుప్తంలో తహసీల్దార్‌కు తమ సమస్యలు వివరిస్తున్న రైతులు

ఉప్పలగుప్తం: కూనవరం మేజర్ డ్రెయిన్ సముద్రంలో కలిసే చోటు (మౌత్ పాయింటు) మొగను తవ్వితే ఉప్పునీరు వరి చేలలోకి ప్రవేశించి మాడిపోతాయని మండలానికి చెందిన పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి చీకట్లపాలెంలో బుధవారం సమావేశమయ్యారు. సమస్య పరిష్కారం కోసం స్థానిక తహసీల్దార్ మల్లికార్జునరావుకు వినతిపత్రం అందజేశారు. మొగను తవ్వితే రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని వివరించారు. ఏటా మొగను తవ్వడం ద్వారా ఉప్పు నీరు ప్రవేశించి తొలకరి పంటను నష్టపోతున్నామని చెప్పారు. ఈ నష్టాన్ని తట్టుకోలేక కొన్నేళ్లుగా తొలకరి సాగుకు పంట విరామం ప్రకటించుకుంటున్నట్టు వాపోయారు. ఈ ఏడాది మొగ ఇసుక మేటలతో మూసుకుపోవటంతో ప్రస్తుతం చేలల్లోకి ఉప్పునీరు ప్రవేశించలేదని, దీంతో నారుమడులు సిద్ధం చేసుకున్నామన్నారు. కొందరు తమ స్వార్థం కోసం మొగను తవ్వేందుకు యత్నిస్తున్నారని, అదే జరిగితే రైతులు తొలకరి పంటను నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉప్పునీరు చేలల్లోకి ప్రవేశించటంతో చేల గట్లపై ఉన్న కొబ్బరి చెట్లు సైతం మాడిపోయి ఆదాయాన్ని కోల్పోయామన్నారు.

నిరుపయోగంగా 500 ఎకరాలు

పదేళ్లుగా ఉప్పునీటి ప్రభావానికి 500 ఎకరాల పంట భూమి పనికి రాకుండా పోయిందని రైతులు తెలిపారు. డ్రెయిన్‌కు ఇరువైపులా ఉన్న టైడల్ బ్యాంకు పటిష్టం చేయాలని, శాశ్వత పరిష్కారంగా మొగ వద్ద స్లూయిజ్‌లు ఏర్పాటు చేసి, ఉప్పునీరు ఎగదన్నకుండా ముంపునీరు దిగేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమస్య పరిష్కారానికి అమలాపురంలో కలెక్టర్‌కు, ఆర్డీఓకు వినతిపత్రాలు ఇచ్చినట్టు రైతులు తెలిపారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధులు అరిగెల నానాజీ, గారపాటి రాజారావు, ఆర్ఎస్ఎన్ రాజు, పోలిశెట్టి భాస్కరరావు, రవణం మధు, బొడ్డు బుజ్జి, కుచ్చర్లపాటి పెద్దిరాజు, కడియం భైరవస్వామి, భూపతిరాజు సత్యనారాయణరాజు, దండు శ్రీనురాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.15 లక్షల జనరేటర్‌కు రక్షణ ఏదీ!?



దేవస్థానం ఆవరణలో రక్షణ ఏర్పాట్లు లేని జనరేటర్

అమలాపురం టౌన్: వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి గతంలో ఓ దాత రూ.15 లక్షల వ్యయంతో సమకూర్చిన ఓ ఆధునాతన జనరేటర్‌కు రక్షణ లేకుండా పోయింది. దేవస్థానం ప్రాంగణంలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తుండడంతో, దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారుల తీరుపై భక్తులు పెదవి విరుస్తున్నారు. జిల్లాలో పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన ఈ స్వామి దేవస్థానంలో కరెంట్ కష్టాలకు చెక్ పెట్టేందుకు పట్టణానికి చెందిన సత్యనారాయణ టెంట్ హౌస్ నిర్వాహకులైన రాకుర్తి కుటుంబీకులు రూ.15 లక్షలతో జనరేటర్‌ను వితరణ చేశారు. కరెంట్ కష్టాలు తీర్చే విలువైన జనరేటర్ అలా వదిలేయడంపై ఇటీవల అదే ప్రాంతానికి చెందిన నాయకుడు అబ్బిరెడ్డి సురేష్ దేవస్థానం ఈఓ సాయిబాబును కూడా ప్రశ్నించారు. ప్రాంగణంలో ఎక్కడో ఓ చోట షెడ్డు నిర్మించి, అందులో జనరేటర్‌ను భద్రపరిచే ప్రయత్నాల్లో దేవస్థానం సిబ్బంది ఉన్నారు. జనరేటర్ నిర్వహణ బాధ్యతలు చూసుకోవాల్సిన దేవస్థానం సిబ్బంది.. ఆ జనరేటర్ సేవలు పొందుతున్నారు కానీ, రక్షణ ఏర్పాట్లను పూర్తిగా విస్మరించారు. ఆరు నెలలుగా జనరేటర్ దేవస్థానం ప్రాంగణంలో ఎలాంటి రక్షణ లేకుండా ఉంది. కొద్ది రోజుల్లోనే జనరేటర్‌కు షెడ్డు నిర్మిస్తామని దేవస్థానం సిబ్బంది తెలిపారు.

డిమాండ్ల సాధనకు కార్మికుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అమలాపురం రూరల్: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న డిమాండ్స్ డేను పురస్కరించుకుని అమలాపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని కోరారు. కార్మికులకు వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా గత పాలకులు వ్యవహరించారని మండిపడ్డారు. అందువల్ల ప్రజలు కేంద్రంలో బీజేపీ బలాన్ని గణనీయంగా తగ్గించారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో జరిగిన కార్మిక, కర్షక ఉద్యమాల ఫలితంగా బీజేపీ అనేక ఎంపీ స్థానాలు కోల్పోయిందని విశ్లేషించారు. చావు తప్పి కన్ను లొట్టబోయినట్టు కేంద్రంలో బీజేపీ ఇతర పార్టీ ల మద్దతుతో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన టీడీపీ ప్రభుత్వం, కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డీటీ సుబ్రహ్మణ్యానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు అమూల్య, రుక్మిణి, దైవకృప, సత్యవాణి, విజయ, ప్రమీల, సత్యవతి దుర్గాదేవి, ధనలక్ష్మి, సంగీత, ఈశ్వరి, ఝాన్సీలక్ష్మి, లోవలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

ముమ్మిడివరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని, లేని పక్షంలో ఐక్య పోరాటాలు తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. అఖిల భారత కోర్కెల దినం సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, డ్వాక్రా, మెప్మా, మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శ్రీనునాయక్‌కు అందజేశారు.

ఉప్పలగుప్తం: కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ సీఐటీయూ నాయకురాలు పి.బేబి గంగారత్నం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సంఘ నాయకులు జె.భద్రకాళి, సలాది ముత్యాలరావు, మేకల బాలవేణి తదితరులు పాల్గొన్నారు.

యానాం: కేంద్రంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆలిండియా వర్కర్స్ డిమాండ్స్ డే సందర్భంగా స్థానిక ఆర్ఏఓ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసే యోచనను ఉపసంహరించుకోవాలని సంఘ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు.

చిన్నారులను బడులకు పంపాలి



అమలాపురంలో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఈఓ కమలకుమారి

అమలాపురం రూరల్: చిన్నారులను పనులకు పంపకుండా బడికి పంపాలని డీఈఓ ఎం.కమలకుమారి అన్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అమలాపురం మండలంలో 'నేను బడికి పోతా' ర్యాలీ నిర్వహించారు. డీఈఓతో పాటు, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ మధుసూదనరావు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమన్నారు. ఆరేళ్ల నుంచి బడిఈడు పిల్లలందరూ స్కూళ్లలోనే ఉండాలన్నారు. చిన్నారుల చదువును హరించే హక్కు ఎవరికీ లేదన్నారు. మధ్యలో బడి మానేస్తున్న చిన్నారులను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ఈ కార్యక్రమం అమలు చేస్తున్నట్టు వివరించారు. చిన్నారుల విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలను తల్లిదండ్రులకు వివరించి, పిల్లలను స్కూళ్లలో చేర్పించడం ద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ ఎస్.దుర్గాదేవి, సమగ్ర శిక్షా ఏఎంఓ బీవీ సుబ్రహ్మణ్యం, ఎస్కే రహమాన్, సీఆర్పీ ఎం.అనుష తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు వెంటనే విడుదల చేయాలి

సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరసన



ఐ.పోలవరంలో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఐ.పోలవరం: రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగులకు బకాయి ఉన్న మే, జూన్ నెల జీతాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆయా ప్రాజెక్టుల పరిధిలోని ఉద్యోగులు నిరసన తెలిపారు. రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు ఎంఈఓ కార్యాలయం, జెడ్పీ హైస్కూళ్ల ఉద్యోగులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. గతంలో చేసిన 22 రోజుల సమ్మె జీతాలనూ విడుదల చేయాలని కోరారు. ఉద్యోగులకు ఎంటీఎస్ అమలు చేసి, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఉప్పలగుప్తం: సమగ్ర శిక్షాలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని గొల్లవిల్లి పాఠశాలలో భోజన విరామ సమయంలో సిబ్బంది నిరసన చేపట్టారు. హెచ్‌ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

సంక్షిప్తంగా..

అధిక ఫీజుల వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

అమలాపురం టౌన్: జిల్లాలో, ముఖ్యంగా పట్టణాల్లో ప్రైవేటు విద్యా సంస్థలు పుస్తకాల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న పరిస్థితులపై ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. జిల్లాలోని కార్పొరేట్ విద్యా సంస్థలపై జిల్లా విద్యా శాఖాధికారులు విచారణ జరిపి, తనిఖీలు నిర్వహించి ఆయా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. బుధవారం స్థానిక గొల్లగూడెంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో ఆయా సంఘాల ప్రతినిధులతో ఎస్ఎఫ్ఐ జిల్లా శాఖ కన్వీనర్లు కె.శంకర్, కె.ప్రణీత్ సాయి అత్యవసర సమావేశంలో చర్చించారు. అధిక ఫీజుల భారాన్ని భరించలేక కొందరు విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై చదువులో వెనకబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఎస్ఎఫ్ఐ ప్రత్యక్ష ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు పాలమూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులతో మేలు

తాళ్లరేవు: ఆక్వా పరిశ్రమలో రైతులు ఉత్తమ యాజమాన్య పద్ధతులను పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జాతీయ మత్స్య రైతు దినోత్సవాన్ని మత్స్యశాఖ అధికారి జి.గోపి అధ్యక్షతన నిర్వహించారు. తాళ్లరేవు, కాజులూరు మండల ఆక్వా రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మత్స్య పరిశ్రమ సుస్థిర అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను మత్స్యశాఖ ఏడీ ఎం.లావణ్య వివరించారు. ఎఫ్‌డీఓ గోపి మాట్లాడుతూ మత్స్య పరిశ్రమ అభివృద్ధికి రైతులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కాజులూరు మండల మత్స్య శాఖ సహాయ తనిఖీ అధికారి ఎస్.సుహాసిని, నాయకులు రాయుడు గంగాధర్, సాగర మిత్రలు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ పట్టివేత

ఐ పోలవరం: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్న వాహనాన్ని బుధవారం విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్నారు. మండలంలోని కొమరగిరి సమీపాన జాతీయ రహదారిలో బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా, వెయ్యి లీటర్ల ప్లాస్టిక్ టిన్నులు రెండు, వంద లీటర్ల పీపాలు నాలుగింటిలో సుమారు 2,800 లీటర్ల డీజిల్‌ను గుర్తించారు. రూ.8.73 లక్షల విలువైన డీజిల్‌ను, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్టు, ఆ వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్టు రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేవీఎస్ ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపారు. యానాం బస్టాండ్ సమీపంలో నీలియా ఫ్యూయిల్స్ బంక్ నుంచి అమలాపురం తాండపల్లికి సరకును తరలిస్తున్నారన్నారు. విజిలెన్స్ ఎస్సై జగన్నాథరెడ్డి, ఏఓ భార్గవ్‌మహేష్, కిషోర్, సీఎస్‌డీటీ లక్ష్మీప్రసన్న, వీఆర్ఏఓ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పశుగ్రాసంతో పాల ఉత్పత్తి సామర్థ్యం పెంపు

అమలాపురం రూరల్: పాడి పశువుల్లో పాల ఉత్పత్తి సామర్థ్యం పెరగాలంటే పశుగ్రాసం ముఖ్య పాత్ర పోషిస్తుందని అమలాపురం పశు సంవర్థక శాఖ ఏడీ ఎల్.విజయరెడ్డి అన్నారు. పాలగుమ్మి, నల్లమిల్లి గ్రామాల్లో పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సూపర్ నేపియర్, కో3, కో4, జనుము, జొన్న, అలసంద, పిల్లి పెసర వంటి ఏకవర్షిక, బహువచక పశుగ్రాసాల ప్రాముఖ్యాన్ని వివరించారు. మండల పశువైద్యాధికారి పూర్ణిమ పాల్గొన్నారు.

గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నేరం

కాట్రేనికోన: గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం చట్టరీత్యా నేరమని, ఈ పరీక్షలు చేసిన వైద్యులపై కఠిన చర్యలు తప్పవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తులసి, ఎల్వీ రమణి హెచ్చరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కాట్రేనికోన పీహెచ్‌సీలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీడీఎస్, వైద్యారోగ్య శాఖ సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం తదితర అంశాలను ఈ సందర్భంగా వివరించారు.

ఓడలరేవులో స్వచ్ఛత పక్షోత్సవాలు



తీర ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

అల్లవరం: గెయిల్ ఇండియా తాటిపాక వారి ఆధ్వర్యంలో ఓడలరేవు సముద్ర తీరంలో స్వచ్ఛత పక్షోత్సవాలను బుధవారం నిర్వహించారు. గెయిల్ ఇన్‌చార్జి రాంబాబు ఆధ్వర్యంలో సిబ్బంది తీర ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల ఒకటి నుంచి పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎస్ రామకృష్ణ, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుంభవృష్టితో రోడ్లు జలమయం

తాళ్లరేవు: మండలంలో బుధవారం కుంభవృష్టి కురిసింది. రెండు గంటల పాటు ఎడతెరిపిలేని వర్షంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. తాళ్లరేవు, సీతారామపురం పి.మల్లవరం తదితర గ్రామాల్లో రోడ్లు నీట మునిగాయి. పరదేశమ్మ వీధి పంట కాలువలా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నీరు నిలిచిపోయింది.

కొమ్ము పురుగు నివారణపై అవగాహన

యానాం: కొబ్బరి సాగులో కొమ్ము పురుగుతో జరుగుతున్న నష్టాలను నివారించడానికి చేపట్టాల్సిన చర్యలపై బుధవారం వ్యవసాయ శాఖ డీడీ డాక్టర్ శివసుబ్రహ్మణియన్ రైతులకు అవగాహన కల్పించారు. కనకాలపేట గ్రామంలో కవల కోటేశ్వరరావు కొబ్బరితోటలో కార్యక్రమం జరిగింది.

ఎంపీ హరీష్‌కు సత్కారం



ఎంపీని సత్కరిస్తున్న చేనేత నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురం ఎంపీగా ప్రమాణ స్వీకారం చేశాక తొలిసారిగా బండారులంక వచ్చిన గంటి హరీష్ మాథుర్‌ను చేనేత సంఘ నాయకులు సత్కరించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చింతా అత్తిలింగం, పుత్సల వరదరాజులు బుధవారం శాలువా, నూలు దండ, చేనేత వస్త్రంతో ఆయనను సన్మానించారు. చేనేత కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ చెప్పారు.